సాక్షి మహబూబాబాద్

ఆదివారం | 6 | అక్టోబర్ | 2024



రూ.పది నాణెం చలామణిలోనే..

రూ.పది నాణెం చలామణిలో ఉందని, ఈ విషయంలో వదంతులు నమ్మొద్దని ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ప్రకాశ్ చంద్ర తెలిపారు.

- 8లో▸



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

38.4°/21.8°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎల్‌ఆర్‌ఎస్ స్థలాల పరిశీలన వేగవంతం



సాక్షి ఎఫెక్ట్

మహబూబాబాద్: జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సాక్షి దినపత్రికలో 'పరిష్కారమెప్పుడో?' శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు మానుకోట మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ఎల్‌ఆర్‌ఎస్ స్థలాల పరిశీలనను వేగవంతం చేశారు. ఈదులపూసపల్లి రోడ్డులోని పలు ప్రాంతాల్లో ఎల్‌ఆర్‌ఎస్ స్థలాలను పరిశీలన చేశారు. టీపీఎస్ ప్రవీణ్‌తో పాటు సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాలతో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేశామన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కూడా పరిశీలనను వేగవంతం చేస్తే త్వరగా దరఖాస్తులు పరిష్కారమవుతాయి.

నాణ్యమైన ఎరువులు విక్రయించాలి



గూడూరు: వ్యవసాయశాఖ అనుమతులతో నాణ్యమైన ఎరువులు, మందులు విక్రయించాలని డీఏఓ విజయనిర్మల అన్నారు. మండల కేంద్రంతో పాటు బొద్దుగొండ, తీగలవేణి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను శనివారం ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని స్టాక్ రిజిస్టర్లు, గోడౌన్‌ల్లోని ఎరువుల కంపెనీల వివరాలను పరిశీలించారు. అనంతరం షాపుల యజమానులు ఈ–పాస్ ద్వారానే నాణ్యమైన ఎరువుల క్రయవిక్రయాలను జరపాలని, స్టాక్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్‌మాలిక్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ డంపులు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో అక్రమంగా ఇసుకను తరలించి డంపు చేస్తున్నారు. వాగులు, వంకల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తీసుకువచ్చి ఒకచోట డంపు చేసి, తిరిగి ట్రాక్టర్ల ద్వారా విక్రయాలు చేపడుతున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వల్ల ఇసుక అక్రమ రవాణా, అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. ఇసుక డంపుల సమాచారం తెలిసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన



మహబూబాబాద్ అర్బన్: డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ముగిసిందని డీఈఓ వి.రాజేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్‌లో శనివారం డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడారు. ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరిగిందన్నారు. మొత్తం 990 మంది అభ్యర్థులకు 896 మంది హాజరయ్యారని, వారి సర్టిఫికెట్లను పరిశీలించామన్నారు. ఎస్‌ఏలో విభాగంలో 18మంది, ఎల్‌పీలో నలుగురు, పీఈటీలో ముగ్గురు, ఎస్జీటీలో 63మంది, స్పెషల్ ఎడ్యుకేషనల్ విభాగంలో ఆరుగులు హాజరుకాలేదన్నారు. ప్రత్యేక బృందాలతో 1:3 నిష్పత్తిలో పరిశీలన చేశామని, ఎక్కడ కూడా పొరపాటు జరగకుండా చర్యలు తీసుకన్నామన్నారు. సర్టిఫికెట్ల పరిశీలనకు సహకరించిన ప్రత్యేక బృందాలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బందికి డీఈఓ కృతజ్ఞతలు తెలిపారు. విద్యాశాఖ అధికారులు మందుల శ్రీరాములు, అప్పారావు, ఉమామహేశ్వర్‌రావు, ఆజాద్‌చంద్రశేఖర్, సంతోష్ పాల్గొన్నారు.

బొమ్మల కొలువు.. భక్తికి నెలవు!

తొమ్మిది మెట్లు.. ఒక్కో మెట్టుకు దేవతామూర్తుల బొమ్మలు.. ఉదయం, సాయంత్రం భక్తిశ్రద్ధలతో పూజలు, ముత్తయిదువులతో పేరంటాలు.. నవరాత్రులు పండుగే.. పండుగ. చివరి రోజు విజయ దశమిన ఉద్వాసన.. రాక్షసుడిపై దుర్గాదేవి విజయానికి గుర్తుగా జరుపుకునే ఈ పండుగే బొమ్మల కొలువు. సాధారణంగా బొమ్మల కొలువును కొందరు దీపావళికి, మరికొందరు సంక్రాంతికి జరుపుకుంటారు. కానీ, ఉమ్మడి జిల్లాలోని పలుప్రాంతాల్లో స్థిరపడిన తమిళనాడువాసులు దసరాకు జరుపుకోవడం వారి సంప్రదాయం. దేవీ శరన్నవరాత్రులు, తిరుపతిలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ పండుగను వైభవంగా జరుపుకుంటున్నారు. **ఈ పండుగ ప్రాశస్థ్యం, పూజా విధానం తదితర ప్రత్యేకతలే ఈ వారం సండే స్పెషల్.**

- కేసముద్రం

దసరా నవరాత్రులు, శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పండుగ

- అన్ని బొమ్మల్లో ఒకే దైవాన్ని తలుచుకుని ఏర్పాటు
- తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు, చివరి రోజున ఉద్వాసన
- ఉమ్మడి జిల్లాలోని తమిళనాడు వాసుల వినూత్న పూజలు

సండే స్పెషల్

బొమ్మల కొలువులో కలశం





ఓ ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు



వివాహం అనంతరం కూతుళ్లకు ఇచ్చే రెండు బొమ్మలు ఇవే



కోమటిపల్లిలోని ఓ ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

తమిళనాడులోని శ్రీరంగం, తిరుచిరాపల్లికి చెందిన కూరత్తాళ్వార్ వంశస్తులైన వేదవ్యాసభట్టార్‌లు వందల సంవత్సరాల క్రితం సంచారమార్గంగా వైష్ణవ మత ప్రచారంలో భాగంగా తెలంగాణ ప్రాంతానికి వచ్చారు. రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో స్థిరపడ్డారు. ఉమ్మడి జిల్లాలోని ఇనుగుర్తి మండలం కోమటిపల్లి, కేసముద్రం మండలం కల్వాల, నెల్లికుదురు మండలంలోని చిన్నముప్పారం, వావిలాల, తొర్రూరులోని కర్కాల, అరిపిరాల, నర్సంపేటతోపాటు పలు గ్రామాలకు వచ్చారు. అప్పట్లో ఈ ప్రాంతాలను ఏలుతున్న దొరలు, వారికి పలు గ్రామాల్లో భూములను ఇవ్వడంతో స్థిరపడ్డారు. వందల సంవత్సరాలు కావొస్తున్నా, వారి ఆచారం, సంస్కృతీసంప్రదాయాలను కొనసాగిస్తూ వస్తున్నారు. ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామంలో సుమారు 13 కుటుంబాలు స్థిరపడగా, ఈ యేటా 5 కుటుంబాల్లో తమిళులకు ప్రాశస్త్యమైన పెరటిమాసంలో శుద్ధపాడ్యమి నాడు బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ఒక్కో బొమ్మకు ఒక్కో అలంకరణ చేసి, విద్యుత్ కాంతుల్లో నవరాత్రులు పూజలు చేస్తూ, శ్రవణానక్షత్రంతో కూడిన విజయదశమి రోజున ఉద్వాసన పలుకుతారు.

పూజా విధానం ఇలా..

తిరుపతిలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా అక్కడికి వెళ్లలేని కూరత్తాళ్వార్ సంబంధీకులు తమ ఇళ్లల్లో దేవతామూర్తుల ప్రతిమలతోపాటు పలు రకాల బొమ్మలతో కొలువు ఏర్పాటు చేశారు. తొమ్మిది మెట్లలో వారి కళాదృష్టి, ఆర్థిక స్తోమత, సౌకర్యాలను బట్టి రకరకాల బొమ్మలను అమర్చారు. ఆ విధంగా సప్తమి అశ్వయుజ శుద్ధపాడ్యమి రోజున రెండు కలశాలను లేదా కొబ్బరికాయలను బొమ్మల కొలువులో ఉంచి పూజలు ప్రారంభించారు. మూల నక్షత్రంలో సరస్వతీదేవి వద్ద వాయిద్యాలు, పుస్తకాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నవమి నాడు ఉత్తరాషాఢ నక్షత్రంలో లక్ష్మీదేవి పుట్టిన రోజు సందర్భంగా అష్టోత్తరం పూజలు చేస్తారు. దశమి శ్రవణ నక్షత్రంలో విజయదశమి రోజున ఉద్వాసన పలుకుతారు. ఇలా నవరాత్రుల్లో ప్రతీరోజు ఉదయం పలురకాల పిండివంటలు తయారు చేసి, స్వామివారికి సమర్పిస్తున్నారు. సాయంత్రం ముత్తయిదువులను పిలిచి పేరంటాలు చేసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేవతామూర్తుల ప్రతిమలతోపాటు పక్షులు, జంతువులు, చెట్లు ఇలా అన్ని రకాల బొమ్మలను ఉంచి, వాటిలో ఒకే దైవాన్ని తలుస్తూ ప్రకృతిలో అన్నింటిని ఆరాధించి పూజలు చేస్తున్నారు.

బొమ్మలు @ వందేళ్లు

కూరత్తాళ్వార్ వంశానికి చెందిన వేదవ్యాస భట్టార్‌లు మూడు తరాలుగా బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. బొమ్మల కొలువులో వంద సంవత్సరాల క్రితం నాటి ఎర్రచందనం బొమ్మలు, ఇతర చెక్కబొమ్మలు ఉండటం విశేషం. తమ ఇళ్లలో ఆడపిల్లల పెళ్లి అయ్యాక, అత్తగారింటికి వెళ్లే సమయంలో కూతురికి రెండు బొమ్మలను ఇస్తామని ఒకరు తెలిపారు. ఆ తర్వాత ప్రతియేటా బొమ్మలను క్రమక్రమంగా పెంచుకుంటూ పోతారు. 33 కోట్ల దేవతలకు బొమ్మల కొలువులో చేసే పూజలు అందుతాయని, ఈ సీజన్‌లో మనుషులకు వచ్చే రోగాలు పోయి, సుఖసంతోషాలతో గడపాలనే ఉద్దేశంతో దేవీశరన్నవరాత్రులకు ఈ పూజలను నిర్వహిస్తారని వేదవ్యాస భట్టార్‌లు తెలిపారు.

44 ఏళ్లుగా ఏర్పాటు చేస్తున్నాం



నేను పుట్టకముందే తమిళనాడు నుంచి మా తాత వచ్చాడు. 1980లో నాకు వివాహం జరిగింది. తరతరాలుగా వస్తున్న మా ఆచారాన్ని కొనసాగిస్తున్నాం. 44 ఏళ్లుగా మా ఇంట్లో బొమ్మల కొలువును ఏర్పాటు చేసి, పూజలు చేస్తున్నాం. ప్రతీరోజు పిండివంటలు చేస్తూ, సాయంత్రం ముత్తయిదువులను పిలిచి పేరంటాలు చేస్తుంటాం. నవరాత్రులు మా ఇళ్లలో పండుగ వాతావరణం ఉంటుంది.

-వేదవ్యాస మాధవి, కోమటిపల్లి, ఇనుగుర్తి మండలం

మరిచిపోలేని పండుగ ఇది..



మూడు తరాలుగా మా సంస్కృతి ప్రకారం మా ఇళ్లలో బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తూ వస్తున్నాం. ప్రతీయేటా దేవీశరన్నవరాత్రి సందర్భంగా మా ఇంట్లో బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తాం. ప్రత్యేకంగా అలంకరణ చేసి, విద్యుత్ దీపాల వెలుగుల మధ్య బొమ్మలను ఉంచుతాం. స్వామివారికి, అమ్మవార్లకు పూజలు చేస్తాం. మాకు ఇది మరిచిపోలేని పండుగ. **-వేదవ్యాస ఉషారాణి, కోమటిపల్లి**

కొనుగోళ్లకు ఐరిస్

కనుపాప నిర్ధారణతో ధాన్యం సేకరణ

- జిల్లాలో 234 కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం
- ప్రతీ కేంద్రంలో రెండు కౌంటర్లు
- ఏర్పాట్లపై అధికారుల ప్రత్యేక దృష్టి



మహబూబాబాద్: వానాకాలం ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పలు మార్పులు చేసింది. అక్రమాలను అరికట్టేందుకు నూతనంగా ఐరిస్ విధానం ప్రవేశపెట్టింది. అలాగే ప్రతీ కేంద్రంలో రెండు కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. సన్న ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనున్న నేపథ్యంలో.. సన్న, దొడ్డు రకం ధాన్యం నిర్ధారణ బాధ్యతలను ఏఈఓలకు అప్పగించారు. కాగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అక్రమాలకు చెక్..

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఐరిస్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ మేరకు పరికరాలు డీసీఎస్‌ఓ కార్యాలయానికి వచ్చాయి. కాగాధాన్యాన్ని విక్రయించే రైతు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రానికి రావాల్సిందే. ధాన్యం కాంటా పెట్టిన తర్వాత రైతుల ఐరిస్ తీసుకుంటారు. అనంతరం వివరాలను ట్యాబ్‌లలో నమోదుచేస్తారు.రైతులు కేంద్రాలకు రాకపోతే ధాన్యం కొనుగోలు చేయరు. ఈవిధానం ద్వారా కొనుగోళ్లలో అక్రమాలకు తావుండదని అధికారులు చెబుతున్నారు.

234 కేంద్రాలు..

జిల్లాలో వానాకాలంలో సీజన్‌లో రైతులు 2,15,277 ఎకరాల్లో వరి సాగు చేశారు. కాగా 2,88,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈసారి సన్నరకం వరి ఎక్కువ మంది రైతులు సాగు చేశారు. వచ్చే దిగుబడి అంచనాలను బట్టి జిల్లాలో 234 కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు జాబితాను సిద్ధం చేశారు. జిల్లాలో నవంబర్ మొదటి వారం నుంచి వరికోతలు మొదలు అవుతాయి. దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేసేలా ప్లాన్ చేస్తున్నారు.

కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు..

ప్రతీ కొనుగోలు కేంద్రంలో తాగు నీరు, మరుగుదొడ్లు, టెంట్ ఇతర ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఈమేరకు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతీ కేంద్రంలో సన్న ధాన్యం, దొడ్డు ధాన్యం కోసం ప్రత్యేక కౌంటర్లు, కాంటాలు ఏర్పాటు చేయనున్నారు. కాగా జిల్లాలో ముందుగా మండలానికి ఒక కేంద్రం ఆతర్వాత వరి కోతలను బట్టి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

40 లక్షల గన్నీ బ్యాగులు..

జిల్లాలో ప్రస్తుతం 40 లక్షల గన్నీ బ్యాగులు, 10,000 టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. అవసరం మేరకు సరఫరా జరుగుతుందని చెబుతున్నారు. బ్యాగుల కొరత లేదని రైతులకు ఇబ్బంది ఉండదని అధికారులు అంటున్నారు. జిల్లాలో 65 రైస్‌మిల్లులు ఉండగా.. గత సీజన్‌లో సీఎంఆర్ క్లియర్ చేసిన వారికి ధాన్యం కేటాయిస్తారా.. లేదా అన్ని మిల్లులకు దిగుమతి చేస్తారా అనే విషయంలో స్పష్టత లేదు.

ఏఈఓలదే కీలక పాత్ర..

ధాన్యం తేమశాతం పరిశీలన, టోకెన్లు, సన్నరకం ధాన్యం నిర్ధారణలో ఏఈఓలు కీలక పాత్ర పోషించనున్నారు. రైతుల ఆధార్‌కార్డు పాస్‌పుస్తకాలు, బ్యాంక్ ఖాతాలను పరిశీలించి టోకెన్లు ఇస్తే ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకెళ్తారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ చెల్లించనుండగా.. ఏఈఓలు జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఆర్టీసీ గిఫ్ట్ స్కీం విజేతల ఎంపిక

హన్మకొండ: ఆర్టీసీ వరంగల్–1 డిపో పరిధిలో వరంగల్–నిజామాబాద్ మధ్య నడుస్తున్న డీలక్స్ బస్సుల్లో మహిళా ప్రయాణికులను ప్రోత్సహించడానికి గిఫ్ట్ స్కీంను ప్రవేశపెట్టింది. ప్రతి 15 రోజులకు ఒకసారి డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందిస్తోంది. ఈ క్రమంలో శనివారం హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు ప్రయాణికుల చేతుల మీదుగా డ్రా తీసి విజేతలను ప్రకటించారు. ఆర్మూర్‌కు చెందిన అరిఫా ఖానం (9966861143) హనుమకొండకు చెందిన ఎ.నాగేశ్వరి (9502726190), కరీంనగర్‌కు చెందిన షభానా బేగం (9440295850) డ్రాలో బహుమతులు గెలుచుకున్నారు. ఎంపికైన ప్రయాణికులు వరంగల్–1 డిపోలో బహుమతులు అందుకోవాలని డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు కోరారు.

పనుల్లో తీవ్ర జాప్యం

డోర్నకల్ మున్సిపాలిటీలో నిలిచిన అభివృద్ధి పనులు

- ఐదేళ్లక్రితం రూ.25కోట్ల పనులకు శంకుస్థాపన
- ఇప్పటికీ పూర్తి కాని పరిస్థితి
- పట్టించుకోని పాలకులు



పిల్లర్ల దశలో నిలిచిన కూరగాయల మార్కెట్ భవన నిర్మాణ పనులు



పునాదుల్లోనే నిలిచిన మాంసం మార్కెట్ భవన నిర్మాణ పనులు



అసంపూర్తిగా మిగిలిన వైకుంఠధామం

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో ఐదు సంవత్సరాల క్రితం చేపట్టిన అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచాయి. 2018 ఆగస్టు 2న డోర్నకల్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారింది. 2019 జనవరి 22న మున్సిపల్ ఎన్నికలు జరిగి 25న నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం చేసింది. అనంతరం రూ.25 కోట్ల ప్రత్యేక నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. సీసీ రోడ్లు, మేజర్ డ్రెయిన్స్, సెంట్రల్ లైటింగ్, హైమాస్ట్ లైట్లు, పార్కులు, ఆడిటోరియం, మినీ ఆడిటోరియం, గెస్ట్ హౌస్, మోడల్ మార్కెట్, వైకుంఠ ధామం, జంక్షన్ అభివృద్ధి, డంపింగ్ యార్డు నిర్మాణ పనులకు 2019 జూన్ 6న అప్పటి ఎమ్మెల్యే రెడ్యానాయక్ పనులకు శంకుస్థాపన చేశారు. వీటిలో సిమెంట్ రోడ్లు, మేజర్ డ్రెయినేజీలు, సెంట్రల్ లైటింగ్, బతకమ్మ పార్కు, ఎన్టీఆర్ విగ్రహం నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్డుతో పాటు ఎన్టీఆర్ జంక్షన్ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు హెచ్‌ఆర్‌సీ ఆదేశాలతో పునాదుల్లోనే నిలిచాయి. రూ.2.37కోట్లతో చేపట్టిన మార్కెట్ పనులు పునాదుల్లో నిలవగా రూ.37లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. డంపింగ్ యార్డుకు స్థలం దొరకలేదు. దీంతో బంధంకుంట చుట్టూ చెత్త వేస్తుండటంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. ఆడిటోరియం, మినీ ఆడిటోరియం, గెస్ట్‌హౌస్ పనులు ప్రారంభం కాలేదు.

ఏళ్లు గడుస్తున్నా..

అమ్మపాలెం రోడ్డులో 2018 ఏప్రిల్ 30న రూ.1.10 కోట్ల ఐటీడీఏ నిధులతో గిరిజన భవనానికి శంకుస్థాపన చేశారు. 80శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. 2022 మే నెలలో వ్యవసాయ మార్కెట్ ఆవరణలో రూ.2కోట్లతో చేపట్టిన వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు పునాదుల్లోనే నిలిచాయి. 2022 మే నెలలో మున్నేరువాగు ఆనకట్ట వద్ద వైకుంఠధామం పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు 70 శాతం పనులు పూర్తయ్యాయి. 2018లో రూ.20లక్షలతో చేపట్టిన ఐకేపీ భవనం పనులు 80 శాతం పూర్తి కాగా.. నిధుల కొరతతో చాలా కాలం నుంచి పనులు నిలిచాయి. ఏళ్లుగా అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో మున్సిపల్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డోర్నకల్‌కు నిధుల గ్రహణం..



డోర్నకల్ మున్సిపాలిటీకి నిధుల గ్రహణం పట్టింది. పట్టణంలో చేపట్టిన ప్రతీ పనికి నిధులు సకాలంలో మంజూరు కాకపోవడంతో మధ్యలోనే పనులు నిలిచిపోతున్నాయి. ప్రజలకు మున్సిపాలిటీ పాలకవర్గంతో పాటు అధికారులపై నమ్మకం పోయింది.

- కాలా మోనికాజైన్, కౌన్సిలర్

'ఉపాధి'లో రూ.6.76లక్షల దుర్వినియోగం



ఈజీఎస్ పనుల వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

చిన్నగూడూరు: ఉపాధిహామీ పనుల్లో దుర్వినియోగమైన సొత్తును రికవరీ చేయాలని జిల్లా ఏపీడీ శాంతికుమారి మండల అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. పలు గ్రామాల్లో నిధుల దుర్వినియోగంపై నివేదికలు చదివి వినిపించారు. మండలంలోని విస్సంపల్లిలో రూ.1,64,266, జయ్యారం రూ.1,55,621, గుండంరాజుపల్లి 1,06,579, చిన్నగూడూరు రూ.65,671, ఉగ్గంపల్లి రూ.51,956, మంగోరిగూడెం రూ.రూ.50,166, తుమ్మలచెరువుతండా రూ.35,599, పగిడిపల్లి రూ.21,771, మన్నెగూడెం రూ.20,846, మేఘ్యాతండాలో రూ.4,000, మొత్తంగా రూ.6,76,475 దుర్వినియోగమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ.. ఉపాధి హామీలో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో జిల్లా అంబుడ్స్‌మెన్ బి.ఆదాం, ఎంపీడీఓ రామారావు, మండల ఈజీఎస్ సిబ్బంది, సోషల్ ఆడిట్ బృందం తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కుల ధ్రువపత్రాల జారీపై విచారణ

తొర్రూరు: తొర్రూరు పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాల జారీపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. శనివారం పట్టణంలో ఆర్‌ఐ బషీర్, రెవెన్యూ సిబ్బంది విచారణలో పాల్గొన్నారు. డీఎస్సీ–2024 ఉపాధ్యాయుల నియామకంలో జిల్లా కేంద్రంలో చేపట్టిన ధ్రువపత్రాల పరిశీలనలో తప్పుడు కుల సర్టిఫికెట్ల జారీ వ్యవహారం వెలుగు చూసింది. తొర్రూరు పట్టణంలోని సాతాని సామాజికవర్గానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు బీసీ–ఏ కేటగిరిలోని దాసరి కుల ధ్రువపత్రాలను చూపారు. సాతాని సామాజికవర్గం బీసీ–డీ కేటగిరిలోకి వస్తుందని, వారికి బీసీ–ఏ కేటగిరిలోని దాసరి కుల ధ్రువపత్రం ఎలా జారీ చేశారని అభ్యర్థులు డీఈఓకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుకు స్పందించిన డీఈఓ రాజేశ్వర్ దీనిపై సమగ్ర విచారణ జరపాలని తొర్రూరు తహసీల్దార్‌ను ఆదేశించారు. 1:3 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయ నియామకం చేపడుతుండగా తప్పుడు ధ్రువపత్రాలు చూపిన వారికంటే ర్యాంకులో ముందున్న అభ్యర్థి జొరిగె నాగరాణికి అన్యాయం జరగనున్న తరుణంలో ఆమె జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. కాగా పట్టణానికి చెందిన ఇరువురికి 2023లో అప్పటి తహసీల్దార్ నాగేంద్రప్రసాద్ హయాంలో కుల ధ్రువపత్రాలు జారీ చేసినట్లు తెలిసింది. దీనిపై ఆర్డీఓ నర్సింగరావును వివరణ కోరగా.. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో తప్పుడు కుల ధ్రువపత్రాలు చూపిన వ్యవహారంపై విచారణ చేపడుతామన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ... 2023లో పట్టణానికి చెందిన సాతాని సామాజికవర్గానికి చెందిన ఇద్దరికి బీసీ–డీ కుల ధ్రువపత్రాల జారీ జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు.

గాయత్రీమాతగా అమ్మవారు..

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రీభద్రకాళి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం అమ్మవారు గాయత్రీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు నిత్యాహ్నికం జరిపారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ఉదయం చంద్రఘంటా క్రమంలో పూజలు నిర్వహించి సింహవాహనంపై ఊరేగించారు. సాయంత్రం మహిషామర్దినీక్రమంలో అర్చన నిర్వహించి గజవాహనసేవ నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ డీఐజీ అపరాజిత, గిరిజా శంకర్ ఐఏఎస్, అన్నపూర్ణ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు.


సింహవాహనంపై అమ్మవారి ఊరేగింపు

చంద్రఘంటా అలంకరణలో అమ్మవార్లు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం అనుబంధదేవాలయంలోని శ్రీశుభానందాదేవి, శ్రీసరస్వతి అమ్మవార్లు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు చంద్రఘంటా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం దేవస్థానం అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవార్లకు పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. నేవైద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


చంద్రఘంటా అలంకరణలో శుభానందాదేవి అమ్మవారు

భ్రమరాంబిక అమ్మవారికి సుప్రభాత సేవ

ఐనవోలు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం భ్రమరాంబిక అమ్మవారు చంద్రఘంటా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, చక్రోపనిషత్ పారాయణం, శ్రీచక్రార్చన, త్రిశతి పారాయణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రోజూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఈఓ అద్దంకి నాగేశ్వర రావు కోరారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితులు విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భానుప్రసాద్, పాతర్లపాటి నరేశ్, నందనం మధు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


చంద్రఘంటా అలంకరణలో భ్రమరాంబిక అమ్మవారు

అన్నపూర్ణాదేవీగా రుద్రేశ్వరి అమ్మవారు..

హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం రుద్రేశ్వరి అమ్మవారు.. అన్నపూర్ణాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకాలు, శ్రీరుద్రేశ్వరి ఉత్సవమూర్తికి శ్రీచక్రార్చన, నవరసాభిషేకం, చతుష్షి ఉపచారపూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తిని అన్నపూర్ణాదేవీగా అలంకరించారు. అనంతరం అమ్మవారిని పల్లకీలో ప్రతిష్ఠించి త్రికుటాలయం చుట్టూ ఊరేగించారు. యాగశాలలో మహాచండీయాగం నిర్వహించారు. సాయంత్రం వరంగల్‌కు చెందిన పేరిణి నృత్యగురువు గజ్జెల రంజిత్ శిష్య బృందం ప్రదర్శించిన పేరిణి నృత్యాలు అలరించాయి. హనుమకొండ అడిషనల్ కలెక్టర్ ఎర్రమడ వెంకట్‌రెడ్డి దంపతులు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సేవాసమితి సభ్యులు తొటిరెడ్డి రవీందర్‌రెడ్డి, కోణ శ్రీకర్, పల్లం రమేశ్, మహేశ్వరం అభిషేక్, తదితరులు పాల్గొన్నారు


అమ్మవారిని దర్శించుకుంటున్న హనుమకొండ అడిషనల్ కలెక్టర్ ఎర్రమడ వెంకట్‌రెడ్డి దంపతులు

రూ. పది నాణెం చలామణిలోనే..

- తప్పుడు ప్రచారం నమ్మొద్దు
- ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ప్రకాశ్ చంద్ర బరోర్

వరంగల్ చౌరస్తా : రూ. పది నాణెం చలామణిలో ఉందని, ఈ విషయంలో ప్రజలు వదంతులు నమ్మొద్దని భారతీయ స్టేట్ బ్యాంకు జనరల్ మేనేజర్ (నెట్‌వర్క్ టు) ప్రకాశ్ చంద్ర బరోర్ విజ్ఞప్తి చేశారు. శనివారం వరంగల్ జేపీఎన్ రోడ్డులోని ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్‌లో రూ. పది నాణెం చలామణిపై బ్యాంకు డీజీఎం గన్ షామ్ సోలంకి అధ్యక్షతన జరిగిన అవగాహన సమావేశంలో జీఎం ప్రకాశ్ చంద్ర బరోర్ మాట్లాడారు. రూ. పది నాణెం చలామణిలో ఉన్నప్పటికీ కొందరు ప్రజల్లో తప్పుడు ప్రచారంతో అయోమయం సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భారతీయ కరెన్సీకి చెందిన అన్ని రూపాయలు, నాణెలు చెల్లుబాటులో ఉన్నాయని, కానీ దుష్ప్రచారం చేయడం బాధకరమన్నారు. నాణెం చెల్లుబాటులో లేదని ఎవరైనా దుష్ప్రచారం చేస్తే ఆర్‌బీఐని అగౌరవ పర్చినట్లేనన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఉన్నతాధికారులు రవికుమార్ వర్మ, వరంగల్ ప్రధాన శాఖ మేనేజర్ డీఎస్ నరేంద్రకుమార్, ఏజీఎంఎస్ జి.శంకర్, అబ్దుల్ రెహమాన్, వరంగల్ సర్కిల్ అభివృద్ధి అధికారి జితేంద్ర కుమార్ శర్మ పాల్గొన్నారు.


రూ. పది నాణెంపై అవగాహన కల్పిస్తున్న ఉన్నతాధికారులు

కరీంనగర్‌దే ట్రోఫీ..

- రన్నరప్ మహబూబ్‌నగర్
- ముగిసిన అండర్–19 క్రికెట్ పోటీలు


ట్రోఫీ అందుకుంటున్న కరీంనగర్ జట్టుతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించిన అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. పూల్–ఏ, బీ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో రంగారెడ్డి, హైదరాబాద్ మినహా ఉమ్మడి 8 జిల్లాల జట్లు పాల్గొన్నాయి. ఎనిమిది రోజుల పాటు హోరాహోరీ పోరు జరిగింది. చివరకు మహబూబ్‌నగర్, కరీంనగర్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఇందులో కరీంనగర్ రెండు వికెట్ల తేడాతో గెలుపొందింది. మొగిలిచర్ల మైదానంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 240 పరుగులు సాధించింది. మహబూబ్‌నగర్ బ్యాట్స్‌మెన్ అబ్దుల్ 48 పరుగులు, షాడాబ్ 89 పరుగులతో జట్టులో కీలకంగా నిలిచారు. అనంతరం 241 పరుగుల లక్ష్య చేధనలో బరిలోకి దిగిన కరీంనగర్ జట్టు.. 49.5 బంతుల్లో 8 వికెట్లు కోల్పోయి 241 పరుగులు సాధించి రెండు వికెట్ల తేడాతో గెలుపొంది ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ జట్టులో విఘ్నేశ్ 53 పరుగులు, కరణ్ 50 పరుగులు చేసి జట్టు గెలుపులో కీలక భూమిక పోషించారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు వేడుకల్లో వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ చేతుల మీదుగా విజేతకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను హెచ్‌సీఏకు ఎంపిక చేయాలని కోరారు. మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్, కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌రావు, వరంగల్ క్రికెట్ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రఘురాం, మాజీ కార్యదర్శి మార్నేని ఉదయ భానురావు, బాధ్యులు బస్వరాజ్ శ్రీమాన్, బస్వరాజ్ ఉపేందర్, తోట రాము, మంచిక అభినవ్, వినయ్, మట్టెడ కుమార్ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు ఎదురుచూపులు

భరోసా లేని అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల జీవితాలు

- ఈపీఎఫ్, ఈఎస్ఐ లేదనే కారణంతో రెగ్యులరైజ్‌కు నోచుకోని వైనం
- ఒప్పందంలో లేని పనులనూ చేయిస్తున్న అధికారులు
- ప్రమాదాలు జరిగినా పట్టించుకోని దుస్థితి..
- టీజీ ఎన్పీడీసీఎల్‌లో ప్రస్తుతం 1,535 మంది కార్మికులు


నల్లబెల్లిలో స్తంభం ఎక్కి విద్యుత్ మరమ్మతు చేస్తున్న అన్‌మ్యాన్డ్ వర్కర్ రంగనాథస్వామి

నర్సంపేట: టీజీ ఎన్పీడీసీఎల్ పరిధి (ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలు)లో పనిచేస్తున్న అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లు క్రమబద్ధీకరణకు ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఉద్యోగ భద్రత, బీమా వంటి పథకాలు లేకపోవడంతో వారి బతుకులకు భరోసా లేకుండా పోతోంది. ఫలితంగా ఆయా కార్మికుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. కొందరు కార్మికులు విద్యుత్ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు గాయపడి దివ్యాంగులుగా మిగిలిపోయారు. 2013 సంవత్సరం ప్రారంభంలో 250 మంది కార్మికులు పనిచేశారు. 2015లో ఎన్పీడీసీఎల్ సీఎండీగా పనిచేసిన కార్తికేయమిశ్రా 1,607 మంది కార్మికులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. కాగా, జూనియర్ లైన్‌మెన్, లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు చేయాల్సిన పనులను కార్మికులతో బలవంతంగా చేయిస్తున్నారు. ఈ క్రమంలో 60 మంది కార్మికులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా.. 53 మంది కార్మికులు అంగవైకల్యానికి గురయ్యారు.

ఈపీఎఫ్, ఈఎస్ఐ లేదనే కారణంతో..

2016 డిసెంబర్ 4 వరకు పనిచేసిన కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల ప్రచారంలో అప్పటి సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా 23 వేల మంది కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేశారు. ఎన్పీడీసీఎల్‌లో అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లుగా, ఎస్పీడీసీఎల్‌లో కట్టర్లుగా పిలుస్తున్నారు. పేరు మాత్రమే వేరు.. వీరి చేసే పని మాత్రం ఒకటే. కాగా, ఎస్పీడీసీఎల్ యాజమాన్యం కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించింది. కానీ, ఎన్పీడీసీఎల్ యాజమాన్యం చెల్లించలేదు. దీంతో ఎస్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న కట్టర్లను గత ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేదనే కారణంతో ఎన్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ కార్మికులను రెగ్యులరైజ్ చేయలేదు. యాజమాన్యం చేసిన తప్పిదానికి తమను రెగ్యులరైజ్ చేయకపోడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ఒకే రాష్ట్రంలో రెండు విధానాలను అమలు చేయడం ఎంతవరకు సబబు అని కార్మికులు నిలదీస్తున్నారు. దీంతో కొందరు కార్మికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకొని ఉద్యోగాలను వదిలేశారు. విధిలేని పరిస్థితుల్లో ప్రస్తుతం 1,535 మంది మాత్రమే పనిచేస్తున్నారు. వీరిలో సుమారు 1,350 మంది కార్మికులు ఐటీఐ పూర్తి చేశారు. జీఓ 11 ప్రకారం ఐటీఐ పూర్తి చేసిన కార్మికులకు స్కిల్డ్ వేతనం రూ.24 వేలు అందించాలి. నామమాత్రపు పనులు చేస్తున్నారని సెమీస్కిల్డ్ వేతనం రూ.11,731 చెల్లిస్తున్నారు. అంతేకాకుండా ఈ వేతనంలో రూ.1,031 కాంట్రాక్టర్ కమీషన్ రూపంలో నొక్కేస్తున్నట్లు కార్మికులు ఆరోపిస్తున్నారు.

పని భారం.. ప్రమాదపుటంచుల్లో విధులు..

జూనియర్ లైన్‌మెన్లు, లైన్‌మెన్లు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు పట్టణాల్లో నివాసం ఉంటూ విధులకు హాజరవుతారు. ఈ క్రమంలో రాత్రి, పగలు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఒప్పందంలో లేని పనులు చేయాలని కార్మికులపై వారు ఒత్తిడి చేస్తారు. ప్రమాదమని తెలిసినా, పనిభారం పెరిగినా విధులు నిర్వర్తిస్తూ వారు వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ అన్‌మ్యాన్డ్ కార్మికులు కోరుతున్నారు.

సర్వీస్ కాలంగా గుర్తించాలి..



యాజమాన్యం చేసిన తప్పిదానికి కార్మికులను శిక్షించడం సరికాదు. ప్రభుత్వం స్పందిస్తూ ఎన్పీడీసీఎల్‌లో అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలి. ఉద్యోగ ఒప్పందం మేరకు పనులు అప్పగించాలి. గడిచిన 7 ఏళ్ల కాలాన్ని సర్వీస్‌గా గుర్తించాలి.

– మహ్మద్ రఫీ, అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

- వరంగల్ మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 133 Sq. Yards పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మకము కలదు. సంప్ర॥ 7416839492. [W-1237319]
- కాకతీయ యూనివర్సిటీకి దగ్గర్లో, JIO Point కి సమీపంలో నార్త్ ఈస్ట్ ఫేసింగ్‌లో గల G+1 ఇల్లు (221 Sq.Yards) అమ్మకానికి కలదు. సంప్ర॥ సెల్: 8985947319. [W-1239919]

TO-LET

- WGL, కరీమాబాద్, బొమ్మలగుడి దగ్గర మెయిన్ రోడ్ గ్రౌండ్ ఫ్లోర్ డీలక్స్ రూమ్స్ 2 BHK కిరాయికి ఇవ్వబడును. గోశాల ప్రక్కన. సంప్ర: 9848696291 [W-1237317]

PLOT FOR SALE

- ఓగ్లాపూర్ పవర్‌గ్రిడ్‌కు ఎదురుగా 200 ఫీట్ రోడ్డు అనుకొని కాంపౌండ్ కట్టి ఉన్న ప్లాటు (వెడల్పు 30 పొడవు 120) 400 చ॥గ॥ ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 9701218888. [W-1237310]
- యాదగిరిగుట్ట, వంగపల్లిలో గేటెడ్ కమ్యూనిటీ యందు బ్యాంకు లోన్ సౌకర్యంతో ఓపెన్ ప్లాట్లు కలవు. రీసార్ట్స్, స్విమ్మింగ్ పూల్, పార్క్, అన్ని వసతులతో. Ph: 8106340199 [HA-14723]

COMMERCIAL RENT

- Commercial space for Rent Ground & 1st Floor, with Parking 6128 x 2 Floors=12,256 sft. Hyder Manikanta Complex, Old Bus Depot Main Road, Near Thirumala Bar, Hanamkonda, Cont: 9542981472, 9440015246. [W-1239914]

SERVICES

CHANGE OF NAME

- I, BODAGAM SAMATH, W/o. BODAGAM VENKAT REDDY (Old Name), R/o. H.No. 1-1-33/111/301, Mithra Residency, Chaitanyapuri Colony, Near NIT, RE College, Hanamkonda Mandal, Hanumakonda District, T.S. Pin: 506004, I have changed my name as BODAGAM SAMATHA, W/o. Bodagam Venkat Reddy (New Name) for all future purposes. [W-1237321]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

- మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు. సెల్: 9849145043 [W-1237318]

FINANCIAL SERVICES

- బాలాజీ లోన్స్ తక్కువ వడ్డీకే చేయబడును. బిజినెస్, మార్టిగేజ్, హోమ్, టేకోవర్ లోన్స్, ప్లాట్ లోన్ ఇవ్వబడును. I.T. రిటన్స్, G.S.T, పాన్‌కార్డ్. కాకతీయ థియేటర్ దగ్గర, వరంగల్. 85228 25358. [M-1185296]

WANTED

- ప్రముఖ ISO సర్టిఫికేట్ గల కంపెనీలో పనిచేయుటకు మేనేజర్స్, జనరల్ మేనేజర్స్ స్త్రీ/పు॥ కావలెను. ప్రతి నెల లక్ష ఇన్‌కం VRS రిటైర్మెంట్ వారికి కూడా ప్రాధాన్యత. సంప్ర॥ 9866137009. [W-1237320]
- Wanted Experience Staff Nurse for Hospital in Hanamkonda. Contact Cell No: 7680071974. [W-1237316]
- పని మనిషి కావలెను: హన్మకొండలో బెడ్ రెస్ట్ తీసుకుంటున్న స్త్రీకి మా ఇంట్లోనే ఉంటూ తనకి సేవా చేయుటకు స్త్రీ కావలెను. జీతం, భోజన, వసతి కలదు. సెల్: 7569268606 [W-1237256]
- AD GROUP of Companies Wanted Sales Executive (Male), AutoCad Designer (Female), Social Media & Digital Marketing (Female) min 1 Year Experience. Cell: 9550487037. [W-1264999]
- Wanted Lab Technician & M.Pharm / Pharm.D / B.Pharm. D / B. Pharm Graduate Female for Clinic in Hanamkonda. Ph: 9494970980. [W-1239918]
- మహబూబాబాద్‌లో మా షోరూం నందు పని చేయుటకు లేడీ వర్కర్స్ కావలెను. వివరాలకు సంప్ర. సెల్ : 9391 325 192 [M-1185323]
- మీ ఇంటివద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డ్స్ రాయటం స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం 12,000/-. ఫోన్ : 70756 56208 [V-6570]
- Wanted Civil Engineer's Male Only + Marketing Executives for Sai Manikanta Reddy Mix Concrete Diploma/B.Tech, Civil with 2 years Experience Drop your Resume on Whatsapp No's 7670956668, 7330871166, 8555890439, 9849277408. [WA-14711]
- Walkin interview for ELECTRICIAN & MECHANIC Contact : 7989896938/ 9542341512 [HA-4880]
- పోచంమైదాన్ నక్కలగుట్ట ఏరియాలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ షోరూంలో పని చేయుటకు హెల్పర్స్ బాయ్స్ కావలెను. 9గం. డ్యూటీ 4 w/o ESI+PF+మంచి జీతం. Ph: 9032153413 [H-796692]
- ఒమేగా హోమ్‌కేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావాలి. ఫ్రీ ఫుడ్ వసతి. జీ: 18K. ఫోన్: 8977639662 [SCA-24000291]
- వరంగల్ ఆఫీస్‌లో పనిచేయుటకు M/F మరియు పార్ట్ టైం/ఫుల్ టైం M/F కావలెను. Cell: 9848073605 [HA-4911]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నరేశ్ రెడ్డికి కన్నీటి వీడ్కోలు

- తరలివచ్చిన అశేష జనం
- నివాళులర్పించిన రాజకీయ ప్రముఖులు, అభిమానులు

మరిపెడ రూరల్ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నూకల నరేశ్‌రెడ్డికి అశేష జనవాహిని కన్నీటి వీడ్కోలు పలికింది. శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం ఏరువాక (వ్యవసాయ క్షేత్రం)లో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఫామ్‌హౌస్‌లో ఉంచిన పార్థివదేహానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వేలాది మంది అభిమానులు తరలివచ్చి నివాళులర్పించారు. తన వ్యవసాయ క్షేత్రంలో నరేశ్‌రెడ్డి అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. కాగా, నూకల నరేశ్‌రెడ్డి ఇటీవల గుండెపోటుకు గురికావడంతో హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని స్టార్ ఆస్పత్రిలో నాలుగు రోజులు చికిత్స పొందాడు. అయినా ఆరోగ్య పరిస్థితి విషమించి శుక్రవారం సాయంత్రం చనిపోయిన విషయం తెలిసిందే. నరేశ్ రెడ్డి భౌతికకాయాన్ని కడసారి చూసేందుకు ఆయన ఏరువాకకు రాజకీయ ప్రముఖులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులర్పించారు. మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రామసహాయం సురేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, నల్లు సుధాకర్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్, మురళీనాయక్, కోరం కనకయ్య, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, పాయం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, కర్నె ప్రభాకర్, బస్వరాజ్ సారయ్య, ఎంపీలు పోరిక బలరాంనాయక్, రామసహాయం రఘురాంరెడ్డి, ఈటల రాజేందర్, మాజీ ప్రజాప్రతినిధులు డీఎస్ రెడ్యానాయక్, మాలోత్ కవిత, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గాదరి కిశోర్, అరూరి రమేశ్, మార్తినేని ధర్మారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్, మహేందర్‌రెడ్డి, అచ్యుత్‌రావు, నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అరుణరాంబాబు, మాజీ జెడ్పీటీసీ శారదారవీందర్‌నాయక్‌లు నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.


నరేశ్‌రెడ్డి అంత్యక్రియల్లో మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి, ఎంపీ బలరాంనాయక్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


కన్నీటి పర్యంతమవుతున్న మాజీ మంత్రి సత్యవతి


పాడె మోస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ రఘురాంరెడ్డి


మామిడి మార్కెట్ ఏర్పాటుకు స్థల పరిశీలన


మార్కెట్ కోసం స్థల పరిశీలన చేస్తున్న అధికారులు, వ్యాపారులు

వరంగల్ : ఏనుమాములలోని వ్యవసాయ మార్కెట్ వెనుక ముసలమ్మకుంట వద్ద ఉన్న మార్కెట్ గోదాం ఆవరణలో మామిడి సీజన్‌లో వేలం నిర్వహించేందుకు ఏర్పాటు చేయనున్న స్థలాన్ని మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్, జేడీఎం ఉప్పల శ్రీనివాస్ పరిశీలించారు. శనివారం మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ఫ్రూట్ సెక్షన్ అధ్యక్షుడు వెల్ది సాంబయ్యతో కలిసి మామిడి మార్కెట్ ఏర్పాటు చేసే స్థలాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ గ్రేడ్–2 కార్యదర్శి రాము, డీఈ ఎల్లేశ్, జేఎంఎస్ రాజేందర్, సూపర్‌వైజర్లు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆశన్న మృతి చెందాడని వదంతులు

- సోషల్ మీడియాలో వైరల్
- శనివారం రాత్రి వరకూ వెలువడని అధికారిక ప్రకటన
- కుటుంబీకులకూ అందని సమాచారం


ఆశన్న (ఫైల్)

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మావోయిస్టు అగ్రనేత తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు శనివారం సోషల్ మీడియాలో వైరలైంది. బీజాపూర్‌లో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో సుమారు 31మంది మావోయిస్టులు మృతిచెందగా, అందులో తెలంగాణకు చెందిన నలుగురు అగ్రనేతలు ఉన్నట్లు తెలియడంతో ఆశన్న సైతం మృతి చెందినట్లు ప్రచారం జరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రులు నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, నారా చంద్రబాబునాయుడుపై జరిగిన దాడుల్లో సెంట్రల్ యాక్షన్ బృందం ఇన్‌చార్జ్‌గా ఉన్న ఆశన్న ప్రధానపాత్ర పోషించినట్లు అప్పట్లో పోలీసులు ప్రకటించారు. అంతేకాకుండా మాజీ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి హత్య కేసులోనూ ఆశన్న ప్రధాన నిందితుడిగా పోలీసులు పేర్కొన్నారు. ఆశన్న కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితుడై 1996లో మావోయిస్టు పార్టీలో చేరారు. మూడేళ్ల పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు బాధ్యతలు చేపట్టిన ఆశన్న.. దీర్ఘకాలిక వ్యూహం రూపొందించి అమలు చేయడంలో దిట్టగా పేరు ఉంది. అంచెలంచెలుగా ఎదిగిన ఆశన్న సుమారు 28 సంవత్సరాలుగా మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్నారు. ఆశన్న కుటుంబసభ్యులు ప్రస్తుతం హనుమకొండలో ఉంటుండగా, తమ్ముడు రైల్వేశాఖలో ఉద్యోగం చేస్తున్నారు. ఆశన్న మృతిపై శనివారం రాత్రి వరకూ ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో పాటు కుటుంబసభ్యులకు ఎలాంటి సమాచారం లేదని తెలిసింది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్



మాట్లాడుతున్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్

విద్యారణ్యపురి: పర్యావరణ పరిరక్షణ అందరిబాధ్యతని, వన్య ప్రాణులను కూడా రక్షించాల్సిన అవసరం ఉందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్ అన్నారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలను పురస్కరించుకుని యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ వరంగల్, జేవీవీ, వీఎస్ఎస్ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శనివారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సాహిత్య సాంస్కృతిక అంశాల్లో ప్రతిభాపాటవ పోటీలు, కవి సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా అంపశయ్యనవీన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ఇంకా ప్రజల్లో చైతన్యం రావాల్సి ఉందన్నారు. అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిరోధించే దిశగా యునైటెడ్‌ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ నిర్వాహకులు ఏర్పాటుచేసిన ఉచిత స్టీల్ బ్యాంకును ప్రారంభించారు. ఈ బ్యాంకులో స్టీల్ ప్లేట్స్, గ్లాసులు, టీగ్లాసులు, ఇతర స్టీల్ వస్తువులు వంద చొప్పున ప్రజలకు ఉచితంగా శుభకార్యాలకు నామమాత్రపు రుసుంతో అందించేందుకు ఏర్పాటుచేశారు. సమావేశంలో ఆ సంస్థ అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి టి. శ్రవణ్‌కుమార్, బాధ్యులు నాగేశ్వర రావు, శ్యామ్‌సుందర్, రవిబాబు, సుధాకర్, రాజ్‌కుమార్, భిక్షపతి, వందన, ఉప్పలయ్య, పెండ్లి ఉపేందర్, శశిధర్‌రెడ్డి, ప్రకాశ్, బ్రహ్మాచారి, సిరాజుద్దీన్, రవికుమార్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.